క్లుప్తంగా

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కందనూలు: మున్సిపల్ పరిధిలోని దేశిఇటిక్యాలలో ఆదివారం విగ్రహ ఆవిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ స్టేట్ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితరులు హాజరవుతున్నట్లు తెలియజేశారు. అంబేడ్కర్ అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మేడేను విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్ రూరల్: మే డేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు అశోక్ కార్మికలోకానికి పిలుపునిచ్చారు. శనివారం మేడే కరపత్రాలను విడుదల చేశారు. కేంద్రం 26 కార్మిక చట్టాలను నీరుగార్చే ప్రయత్నం చేశారని, కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపించారు. సుమలత, రాజు, బాలరాజు, జంగయ్య పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా మహేష్

తాడూరు: బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మండలంలోని మేడిపూర్‌కి చెందిన మహేష్ ఎంపికయ్యారు. శనివారం మండలంలోని మేడిపూర్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీసీ సంఘం సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీసీ ఆశయ సాధనకు నిరంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు శివప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర వాయిదా

లింగాల: రోడ్ల బాగుకోసం మండలంలోని ఎర్రపెంట నుంచి లింగాల వరకు శనివారం నిర్వహించాల్సిన పాదయాత్రను వాయిదా వేసినట్లు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు రాథోడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వర్షం కారణంగా పాదయాత్రను వాయిదా వేశామని, తిరిగి మే 3న పాదయాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.


రాజకీయంగా అవకాశం కల్పించాలి

అచ్చంపేట రూరల్: జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని పద్మశాలి యువజన సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు వెంకటనారాయణ కోరారు. శనివారం పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయ ఫంక్షన్ హాలులో పద్మశాలీ యువజన సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయన్నారు. పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలన్నారు. పద్మశాలీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిషోర్, సంతోష్, హరిప్రసాద్, దిలీప్, సుధాకర్, శివకుమార్, రాఘవ పాల్గొన్నారు.

విద్యార్థుల చేయూత

బిజినేపల్లి: మండల కేంద్రంలోని వృద్ధాశ్రమానికి రాజేంద్రనగర్ రావేఫ్ విద్యార్థులు శనివారం తమ వంతుగా చేయూత అందించారు. ముందుగా రావేఫ్ విద్యార్థులు వృద్ధులతో వారి స్థితిగతుల్ని తెలుసుకుని వారితో కాసేపు ఆటవిడుపుగా గడిపారు. తర్వాత వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు డా.శ్రీలత, అరుణ, వృద్ధాశ్రమం అధికారులు, సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌కి చెందిన అనితకు రూ.12 వేలు, ఎల్లికల్‌కు చెందిన మహేష్‌కు రూ.17 వేలు, తర్నికల్ తండాకు చెందిన లలితకు రూ.19 వేల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శనివారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడారు. సీఎం సహాయనిధి పథకం పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ రుక్మద్దీన్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అండగా ఉంటా..

కల్వకుర్తి రూరల్: కళలను ప్రోత్సహిస్తూ.. కళాకారులకు అండగా నిలుస్తామని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఏబీసీడీ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి నృత్య తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, ఆసక్తి ఉన్న వారు నృత్యాన్ని నేర్చుకుని రాణించాలని కోరారు. నృత్య శిబిరం నిర్వాహకులు టింకు, నాని, పవన్, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. భారీ నష్టం

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళన చెందుతున్న రైతులు



కొల్లాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హనుమానాయక్

కందనూలు: అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలకు జిల్లా అతలాకుతలమైంది. కొల్లాపూర్, బల్మూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, ఊర్కొండ, చారకొండ, కల్వకుర్తితో నాగర్‌కర్నూల్‌లో భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వడగండ్లతో వరి, మామిడి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా.. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో, రోడ్ల వెంట ఆరబోసిన ధాన్యం వరద నీటిలో తడిసిపోయింది. జిల్లా కేంద్రంలోని జాతీయ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన వడ్లు, మొక్కజొన్న శనివారం ఉదయం మూడు గంటలకు ఒక్కసారిగా కురిసిన వర్షానికి ధాన్యం అంతా తడిసిపోయింది. నాలుగు రోజుల్లో 600 ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. 450 ఎకరాలు వరి, 64 ఎకరాలు మామిడి, 85 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం వాటిల్లింది.

కొల్లాపూర్‌లో 54.4 మిల్లీమీటర్లు..

కొల్లాపూర్: పట్టణంలో శనివారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. 54.4 మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదయ్యింది. అకాల వర్షం కారణంగా మార్కెట్‌యార్డులో విక్రయించేందుకు రైతులు తీసుకొచ్చిన వరి, మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. ఆ ధాన్యాన్ని ఆర్డీఓ హనుమానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, ఏఓ నాగరాజు పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని మార్కెట్ చైర్మన్ తెలియజేశారు.

తడిసిన ధాన్యం

పెద్దకొత్తపల్లి: మండలంలో శనివారం తెల్లవారుజామున అకాల వర్షం కురవడంతో మండల కేంద్రంతో పాటు దేవల్‌తిరుమలాపూర్, సాతాపూర్, గంట్రావ్‌పల్లి గ్రామాల వద్ద కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న వరిధాన్యం తడిసిపోయింది. దీంతో ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు నానాతంటాలు పడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద సింగిల్‌విండో కార్యాలయం సిబ్బంది, రైతుల వద్ద ధాన్యాన్ని క్వింటాలు రూ.2,060కు కొనుగోలు చేశారు. ఈ ధాన్యం బస్తాలో నింపి లారీలకు ఎత్తకపోవడంతో రైతులే వాటిని తడవకుండా కవర్లు కపి సంరక్షిస్తున్నారు. సంచుల్లో నింపిన ధాన్యం వెంటనే లారీలో తీసుకెళ్లాలని రైతులు బాలస్వామి, వెంకటేష్, బిచ్చిరెడ్డి కోరారు.

పరిహారం ఇచ్చి ఆదుకోండి..



అకాల వర్షాలతో పంట నష్టపోయిన తమకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. తడిసిన వడ్లను, మక్కలకు ఎలాంటి షరతులు పెట్టకుండా కొనుగోలు చేయాలి. వర్షం వస్తుందంటేనే భయమేస్తుంది.
– శేఖర్, మంతటి గ్రామ రైతు



పెద్దకొత్తపల్లిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



నాగర్‌కర్నూల్ మార్కెట్లో తడిసిన ధాన్యం



నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్లో..

ఆదివాసీలపై వైమానిక దాడులు వ్యతిరేకిద్దాం



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

అచ్చంపేట: ఆదివాసులపై జరుగుతున్న వైమానిక దాడులను వ్యతిరేకిద్దామని పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కా బాలయ్య అన్నారు. శనివారం అచ్చంపేటలో ఆదివాసుల దాడులను నిరసిస్తూ అచ్చంపేటలో నిర్వహించనున్న సభకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. యాదగిరి, గడ్డం లక్ష్మణ్, ఎస్.నారాయణరావు, జాజాలి పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

మన్ననూర్: ఆదివాసీలపై జరుగుతున్న వైమానిక దాడులను వ్యతిరేకిస్తూ.. అచ్చంపేటలోని టీఎన్‌జీఓ భవనంలో ఆదివారం నిర్వహించే సభను విజయవంతం చేయాలని పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్క బాలయ్య పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ రావ్ ప్రధాన వక్తలుగా వ్యవహరిస్తారని చెప్పారు.

కార్యదర్శుల సమస్య పరిష్కరించాలి



అచ్చంపేట దీక్షలో కూర్చున్న కార్యదర్శులు


అచ్చంపేట రూరల్: ప్రభుత్వ ఉద్యోగాలకు రెండేళ్ల ప్రొబేషనరీ పిరియడ్ ఉంటే తాము నాలుగేళ్ల చేశామని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెండో రోజు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో మహేష్‌గౌడ్, రాజారత్నం, మక్తలాల్, రాంబాబు కూర్చున్నారు.

కల్వకుర్తి రూరల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు.

కోడేరు: జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి కాలయాపన చేస్తుందని, వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ.. మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు రెండో రోజు సమ్మె చేపట్టారు. రవితేజ, అర్జున్ పాల్గొన్నారు.


పెద్దకొత్తపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు ఐకేపీ వీఓఏల సమ్మెకు కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేలును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాముయాదవ్, యూసుఫ్, బాలపీర్, రసూల్, సయ్యద్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్దండ: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరసనకు శనివారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి ఆధ్వర్యంలో సంఘీభావం తెలియజేశారు. రామచంద్రారెడ్డి, అల్లీ, ఫయాజ్, మురారి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో..

హమాలీలందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: అన్ని రకాల హమాలీలందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం లేబర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలీకి నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వెంకటస్వామి, మోహన్, నరేష్, తిరుపతి, మల్లేష్, రాధకృష్ణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీకి తరలిరావాలి

కొల్లాపూర్: పాలమూరు జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన ర్యాలీకి నిరుద్యోగులు, విద్యావంతులు తరలిరావాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన కొల్లాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. అమరుల త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నేటికి రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు కొనసాగడం బాధాకరమన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారన్నారు. కేసీఆర్ కుటుంబం మాత్రమే రాష్ట్రంలో అన్ని రకాలుగా లబ్ధిపొందుతుందని, సామాన్య ప్రజలు మాత్రం అన్ని రంగాల్లో నేటికి వివక్షకు గురవుతున్నారన్నారు. బీరయ్య యాదవ్, నర్సింహ యాదవ్, పరమేష్, ఫసియొద్దిన్ పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు అప్పగించొద్దు

అచ్చంపేట రూరల్: గ్రామపంచాయతీల అభివృద్ధిలో వివిధ రకాల పనులు నిర్వహిస్తున్నామని అదనపు బాధ్యతలను అప్పగించొద్దని సీనియర్ పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, నిరంజన్, పాండు, లింగస్వామి, వరలక్ష్మి, శిరీష కోరారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీఓకు వినతి అందజేశారు. ప్రస్తుతం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ రెగ్యులరైజేషన్ కోసం సమ్మె చేపడుతున్నారని, వారి స్థానంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు కట్టబెట్టాలని అధికారులు చూడటం సరైంది కాదన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

బిజినేపల్లి: మండలంలోని లింగసానిపల్లికి చెందిన వెంకటయ్య ఆవు శనివారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటయ్య తన పశువుల్ని మేత కోసమని వ్యవసాయం పొలం వద్దకు తీసుకెళ్లాడు. శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్తు తీగ తెగి పొలంలో పడింది. అటుగా వెళ్లిన ఆవు తీగను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ దాదాపు రూ.70 వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

దళితులపై వివక్ష తగదు



లింగాల: సమాజంలో అన్ని వర్గాల వారు సమానమేని, దళితులపై వివక్ష తగదని ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని సూరాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో దళితులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మనుష్యులు కులమతాలకతీతంగా మెలగాలని, దళితులు కూడా ఆలయాల్లో పూజలు నిర్వహించుకోవచ్చన్నారు. దళితులను అంటరాని వారీగా చూడటం నేరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాత్క లక్ష్మమ్మ, తిర్పతమ్మ, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

పరిహారం అందించాలని వినతి

వెల్దండ: మండల పరిధిలోని చొక్కన్నపల్లికి చెందిన భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలని శనివారం రైతులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన నివాసంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా డీ–82 కాల్వ నిర్మాణంలో రైతులు భూములు కోల్పోయి ఏళ్లు గడుస్తున్నా.. నేటికి పరిహారం అందించలేదని తెలియజేశారు. శ్రీనివాస్, అల్వాల్, యాదయ్య, దేవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన ఎండీ జమాలొద్దీన్ కుటుంబాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, వారికి హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, ఎంపీటీసీ రంగారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, నాగర్జునగౌడ్, రాజమౌళి తదితరులు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

తాడూరు: అంధత్వ నివారణకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జానకమ్మ, కంటి వెలుగు కోఆర్డినేటర్ డా ఎండి ఇస్మాయిల్ కోరారు. మండలంలోని గుట్టలపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారం రోజుల పాటు గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ప్రతిరోజు కంటి వెలుగు పరీక్ష కేంద్రానికి వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. వల్లబ్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



కిరణ్‌కుమార్



తేజశ్రీ



భరద్వాజ్



గోపాల్‌నాయక్

అచ్చంపేట రూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అచ్చంపేట ప్రాంతానికి చెందిన విద్యార్థులు సత్తాచాటారు. బల్మూర్ మండలం గట్టుతుమ్మెన్‌కు చెందిన ఆవంచ కిరణ్‌కుమార్ ఓబీసీ క్యాటగిరీలో 1,338 ర్యాంకుతో 99.45 శాతం మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు నారమ్మ, పర్వతాలు వ్యవసాయ పనులు చేస్తుంటారు. మొదటి కుమారుడు వంశీ ఉస్మానియా యూనిర్సిటీలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అచ్చంపేట పట్టణానికి చెందిన కోట భాస్కర్, భాగ్యలక్ష్మి చిన్న కుమార్తె తేజశ్రీ ఓబీసీ క్యాటగిరిలో 8,636 ర్యాంకుతో 96.48 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు అచ్చంపేట వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. అలాగే బల్మూర్ మండల కేంద్రానికి చెందిన మండల వెంకట్‌నారాయణ, విజయలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు మండల భరద్వాజ్ ఎస్సీ క్యాటగిరీలో 1,910 ర్యాంకుతో 95.20 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

అమ్రాబాద్: జేఈఈ పరీక్ష ఫలితాల్లో పదర మండలం జ్యోతినాయక్‌తండాకు చెందిన దేశావత్ గోపాల్‌నాయక్ ఆల్‌ఇండియా స్థాయిలో 424 ర్యాంకు సాధించాడు. గోపాల్‌నాయక్ తల్లిదండ్రులు హైదరాబాద్‌లో దినసరి కూలీలుగా పనిచేస్తూ.. కుమారుడిని చదివించారు. గోపాల్‌నాయక్ ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులు, తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి



తుమ్మలసూర్ తూకం చేస్తున్న నాయకులు



ఊర్కొండలో ప్రారంభిస్తున్న శాంతకుమారి

తాడూరు: తెలంగాణ ప్రభుత్వం రైతుల సౌకర్యం కోసం మండలంలోని మేడిపూర్, తుమ్మలసూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించేందుకు ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం వరి కొనుగోలు కేంద్రాన్ని సింగల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. సింగిల్‌విండో ద్వారా రైతులకు అండగా ఉంటామన్నారు. నూతనంగా ఎన్నికైన కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్‌ను సింగల్ విండో చైర్మన్ భాస్కర్‌రావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మంజుల, వెంకటయ్యగౌడ్, శేఖర్, రాఘవేందర్‌రెడ్డి, జంగయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఊర్కొండ: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీ చైర్మన్ శాంతాకుమారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజయ్‌గౌడ్, జనార్దన్ రెడ్డి, రాజు, శ్రీనివాసులు, గిరి పాల్గొన్నారు.

వరి కోతలు ఆపుకోవాలి



జటప్రోల్‌లో పరిశీలిస్తున్న నాగరాజు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని రైతులందరూ ఇంకా రెండు రోజులు వర్షాలు ఉన్నందున వరి కోతలు ఆపుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు రైతులకు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని రామాపురం, చౌటబెట్ల వరి, వేరుశనగ పంటలను మండల వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రానున్న మూడు రోజులు వర్ష సూచన ఉన్నందున కోతలు ఆపుకోవాలన్నారు.

వరి ధాన్యం పరిశీలన

పెంట్లవెల్లి: మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మండలంలోని జటప్రోల్, గోపులాపురం గ్రామాల్లోని పంటలను, వరి కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈఓ గోవిందు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడారు. తెల్లవారుజామున కురిసిన వర్షానికి 29.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యిందని, కొద్ది రోజులపాటు వర్షాలు ఉన్నాయని, రైతులు వరి కోతలు ఆపుకొని పొలం ఉన్న నిల్వనీరును కాల్వల ద్వారా దిగువకు వదలాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతులు, సిబ్బంది కలిసికట్టుగా ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని రైతులకు, అధికారులకు తెలియజేశారు. ఏఓ నాగరాజు, ఏఈఓ గోవిందు, రైతులు పాల్గొన్నారు.

స్వరాజ్య పాదయాత్ర వాల్‌పోస్టర్ విడుదల



జూపల్లిలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

చారకొండ: స్వరాజ్య పాదయాత్రలో భాగంగా విశారదన్ 10 వేల కిలోమీటర్ల ముగింపు సభకు మండలం నుంచి భారీగా తరలి రావాలని డీఎస్పీ మండల అధ్యక్షుడు విజయ్ పిలుపునిచ్చారు. మండలంలోని జూపల్లిలో స్వరాజ్య పాదయాత్ర వాల్‌పోస్టర్ విడుదల చేశారు. నాయకులు సంజీవ్, బాలస్వామి, తిరుపతి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఊర్కొండ: బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో మే 7న నిర్వహించనున్న నిరసన కార్యక్రమం జైభీమ్ జై భారత్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. హరీష్ హుస్సేన్, అర్జున్, రవికృష్ణ, పరశురాం పాల్గొన్నారు.

మినీ మహానాడు

కొల్లాపూర్: టీడీపీ మే 13న నిర్వహించే మినీ మహానాడు పోస్టర్లను శనివారం కొల్లాపూర్‌లో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుత రామస్వామి యాదవ్, నాయకులు సుధాకర్, కుర్మయ్య, చంద్రయ్య, శ్రీను పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న జంగారెడ్డి

తెలకపల్లి: యుద్ధప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో అకాల వర్షాలతో కల్లాల్లో ఉన్న వరిధాన్యం తడిసిపోయిందని, తడిసిన ప్రతి గింజను సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పోడు పట్టాలకు దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పట్టాలివ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.లక్ష రుణమాఫీ ఏకకాలంలో చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పత్తికి ధర రాకపోవడంతో నేటికి రైతుల ఇళ్లలోనే పత్తి మూలుగుతుందన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపాస్ లక్ష్మణ్, నాగరాజుగౌడ్, శివశంకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ మాలిక్, బాలరాజు, లక్ష్మయ్య, స్వామి పాల్గొన్నారు.